సమష్టిగా పనిచేద్దాం..

- గాజువాకలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం
- పార్టీ కోసం పని చేసేవారికి అండగా ఉంటా..
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్


హాజరైన నాయకులు, కార్యకర్తలు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

పెదగంట్యాడ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా పని చేద్దామని రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేద్దామన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 14 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న ప్రతీ ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం కల్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా పని చేస్తే మన విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రత్యేక పరిస్థితులు, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో గాజువాక అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు సీటు ఇచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరమని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం కోసం అవసరమైతే తాను పోటీ నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశానని, అయితే తనపై నమ్మకం ఉంచి గాజువాక అభ్యర్థిగా నియమించారని చెప్పారు. ఎమ్మెల్యే నాగిరెడ్డిని పదేళ్లుగా చూస్తున్నానని, ఆయన మనస్తత్వం తెలిసిన వ్యక్తినని అమర్‌నాథ్ చెప్పారు. గుడివాడ, తిప్పల కుటుంబాలకు మూడు తరాల నుంచి రాజకీయ అనుబంధం ఉందని గుర్తు చేశారు. తమను నమ్ముకున్న వారికి మంచి చేయడమే తప్ప చెడు చేసిన దాఖలాలు లేవన్నారు. గడిచిన ఐదేళ్లలో అనకాపల్లి నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌తో ఏ విధంగా పని చేశానో, ఇక్కడ కూడా అదే విధంగా పని చేస్తానన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి అనేక పదవులను ఇప్పించి వారి రుణం తీర్చుకున్నానన్నారు.

అమర్‌నాథ్‌ను గెలిపించుకుందాం

మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన అమర్‌నాథ్‌ను గెలిపించుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ అమర్‌నాథ్‌ను నేరుగా సీఎం జగన్ నియమించారన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా సీఎం లబ్ధి చేకూర్చారని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకుని మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ టికెట్ ఇచ్చిన అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పేదవారికి న్యాయం జరగాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. అప్పుడే అవినీతి లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సమావేశంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు పల్లా చినతల్లి, రోజా రాణి, ధర్మాల శ్రీను, కోమటి శ్రీనివాసరావు, గుడివాడ లతీష్, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకట రమణారెడ్డి, బోగాది సన్నీ, మంత్రి శంకరనారాయణ, సిరట్ల శ్రీనివాస్, ఇల్లపు ప్రసాద్, రాజాన వెంకటరావు, కులుకూరి మంగరాజు, బ్రహ్మయ్య, బొడ్డ గోవింద్, గౌస్, సంపంగి ఈశ్వరరావు, వెంపాడ అప్పారావు, షౌకత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం


దాత రవిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొండయ్య వలస గ్రామదేవత మరిడిమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు కొనియాడారు. ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పిళ్లా రవి ఆలయానికి రూ.20వేల విలువైన గోద్రేజ్ బీరువాను అందించడంతో ఆయన్ను అభినందించారు. ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సాయిన సన్యాసిరావు, బలిరెడ్డి సత్యనారాయణ ఆలయ కమిటీ ప్రతినిధులు మరిశా రామచంద్ర రావు, బలిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి అప్పారావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ ఏజెంట్ల బైక్ ర్యాలీ


ర్యాలీ ప్రారంభిస్తున్న సత్యనారాయణ

గాజువాక : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ ఏజెంట్లు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాక బీసీ రోడ్‌లోని కాకతీయ జంక్షన్ నుంచి బయల్దేరి దువ్వాడ ఫ్లై ఓవర్ వంతెన వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీఐ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ తమ సొమ్మును వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు గత ఐదేళ్లుగా పోరాడుతున్నప్పటికీ అగ్రిగోల్డ్ యాజమాన్యానికి చీమ కుట్టినట్టు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.ఆనంద్, అచ్యుతరావు, పి.ఆరెలమ్మ, మధుసూదన్రావు, మంగరాజు, కోటేశ్వరరావు, రమణ, గణేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్ కోర్సు, హోటల్ మేనేజ్‌మెంట్ (ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్ల వయసు గల పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు 91219 99654, 79930 11605 నంబర్లకు ఫోన్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ద్వారకా నగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్ నందు గల హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న సుధారాణి కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధికి తెలంగాణకు చెందిన చల్లా సుధారాణి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు టి. తిరుపతికి ఆదివారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


అగనంపూడి హైస్కూల్లో బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేయిస్తున్న హెచ్‌ఎం కృష్ణారావు

అగనంపూడి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండటంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 వందల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. లంకెల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 227 మంది పరీక్షలు రాయనున్నట్లు పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రౌతు నాగేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసేందుకు పినమడక, లేమర్తి, పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో మరో రెండు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరు కానున్నారు. పెదముషిడివాడ పరీక్ష కేంద్రంలో 212 మందికి గాను లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులతో పాటు పినమడక, లేమర్తి హైస్కూల్ పిల్లలు పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాలు..

అగనంపూడి పరీక్ష కేంద్రంలో ఈ ఏడాది నుంచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కు వీల్లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఏడాది ఉంచి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చినట్లు హెచ్‌ఎం కృష్ణారావు తెలిపారు.

అమర్‌నాథ్‌కు అభినందనలు


అమర్‌నాథ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉక్కునగరం: మంత్రి గుడివాడ అమరనాథ్‌కు 78వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. అమర్‌నాథ్‌కు పార్టీ గాజువాక సీటు కేటాయించిన సందర్భంగా వార్డు నాయకులు ఆయనను కలిసి అభినందించారు. వారు మాట్లాడుతూ అమర్‌నాథ్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ పార్టీ విజయం కోసం సమష్టిగా కృషి చేద్దామని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఎస్.రమేష్‌కుమార్, కనకళ్ల అమ్మాజీ, సీహెచ్. రామకృష్ణ, బి.శివప్రసాద్, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కనులపండువగా ఎల్లమ్మ జాతర


ఎల్లమ్మ అమ్మవారిని తోడ్కొని వెళ్తున్న భక్తులు


ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్న జన సందోహం

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. జగదాంబ జంక్షన్ వద్ద వెలసిన ఆలయంలో వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారితో పాటు ఆమె సోదరుడు పోతురాజుకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, దేవదాయ శాఖ అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, భీమిలి, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఎల్లమ్మ తల్లి పుట్ట వద్ద మాలధారులు శూలాల ప్రదర్శన చేపట్టారు. అగ్నిగుండం తొక్కారు. అమ్మవారి దర్శనం కోసం ఎల్లమ్మ గుడి నుంచి జగదాంబ జంక్షన్ వరకు క్యూలైన్లు బారులు తీరాయి. ఎల్లమ్మ అమ్మవారి పుట్ట, సోదరుడు పోతురాజు పుట్ట వద్ద కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, మొక్కులు సమర్పించుకున్నారు. టూటౌన్, మహారాణిపేట పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి. ఆలయ ఈవో కె. పద్మావతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా రేణుక యల్లమ్మ జాతర..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం కనుల పండువగా సాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. పోలేరమ్మ హుండీ నుంచి కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు.


రేణుక యల్లమ్మ అమ్మవారు

వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత


చెట్టుకు ధాన్యం కంకులు కడుతున్న బాలిక

ఆరిలోవ: ప్రకృతిలో పిచ్చుకలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూ సందర్శకులకు పిచ్చుకలపై అవగాహన కల్పించారు. అనంతరం జూలో పలు చోట్ల చెట్లకు పిచ్చుకుల ఆహారం కోసం ధాన్యం కుంకులు కట్టారు. ఈ సందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో పరిస్థితులు వల్ల పిచ్చుకులు జాతి అంతరించిపోతుందన్నారు. అక్కడక్కడా కనిపించే వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రకృతిలో అన్ని జాతుల జీవులను రక్షించుకుని జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ పాలవలస గోపాలనాయుడు, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది, హరిత వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని, తగదాలు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లు, పాత నేరస్తులకు సీఐ.విజయకుమార్ కౌన్సెలింగ్ చేశారు. ఎన్నికల వేళ జాగ్రత్తగా ఉండాలని, హద్దు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

నేరాల జోలికి పోవద్దు

మద్రిపాలెం: ఫిఫ్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'మహనీయుల త్యాగం వృథా కానివ్వం'


1130వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరో మహనీయుల త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనివ్వబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1130వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులతో పాటు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కును గురించి పోరాడుతున్నా ప్రధాని నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, మరెంతో మందికి పరోక్షంగా ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఉపాలయాల ప్రారంభం


నూతనంగా ప్రారంభించిన సుబ్రహ్మణ్య స్వామి ఉపాలయం


ఉపాలయాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలోని శ్రీ సీతారామాంజనేయ ఆలయంలో నూతనంగా నిర్మించిన ఉపాలయాల ప్రారంభోత్సవం ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వీటిని ప్రారంభించారు. సీతారామాంజనేయ ఆలయంలో శ్రీ పంచముఖ వినాయక, శ్రీ బ్రహ్మసూత్ర శివలింగము, శ్రీ షిరిడీ సాయిబాబా, ఆదిత్య నవగ్రహ, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉపాలయాలతో పాటు నాగబంధం, ధ్వజస్తంభం నిర్మించారు. ప్రారంభోత్సవాల్లో భాగంగా అమర్‌నాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, బొండా గోవిందరాజులు, ఎన్నేటి వెంకటరమణ, ముద్దపు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నేటి నుంచి ఈఎస్ఐ క్యాంప్‌లు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఈఎస్ఐకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 18 నుంచి 28 వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక కార్యదర్శి గొలగాని అప్పారావు తెలిపారు. ఈ శిబిరాలు జోన్‌లోని వివిధ వార్డు కార్యాలయాలు, సచివాలయాలు సహా గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్దేశిత తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ శిబిరాల్లో కార్మికులకు సంబంధించిన ఈఎస్ఐ కార్డులతో ఆధార్ అనుసంధానం, కుటుంబ సభ్యుల వివరాలు అప్‌డేట్ చేయడం వంటి సేవలను పొందవచ్చన్నారు. ఈఎస్ఐ సౌకర్యం లేనివారికి కొత్త కార్డులను ఇచ్చేందుకు కూడా ఈ శిబిరాల్లో వివరాలను నమోదు చేస్తారన్నారు. వివరాల కోసం యూనియన్ నాయకులను సంప్రదించాలని కోరారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు


నిత్య కల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్, తదితరులు ఈ పూజ చేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

అలరించిన సంగీత విభావరి


సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

సీతంపేట: స్వర సాగర్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రాధాకృష్ణ శీర్షికన మూడు గంటల పాటు నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను సంగీత సాగరంలో ముంచెత్తింది. గాయకుడు సింగ్ సంగీత దర్శకత్వంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కె.ఎల్.రావు, లోకేష్, రామ్‌కుమార్, వెంకటేష్, రాధా రాణి, మంజుల, సుజాత, రంజిత, రేణుక, లావణ్య సినీ గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు.

ఉత్సాహంగా భారత్ నివేష్ మారథాన్


బీచ్ రోడ్డులో మారథాన్ ప్రారంభిస్తున్న సెబీ, ఏఎంఎఫ్ఐ అధికారులు

ఆరిలోవ: అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇండియా(ఏఎంఎఫ్ఐ), సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ) సంయుక్తంగా ఆదివారం బీచ్‌రోడ్డులో భారత్ నివేష్ మారథాన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మారథాన్‌ను ఆర్కే బీచ్ వద్ద సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రామ్మోహన్‌రావు, ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట చలసాని, నేవల్ ఈస్టర్న్ కమాండ్ రీపిట్ ఆఫీసర్ ఎస్.సబేశన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల అధికారులు మాట్లాడుతూ సమాజంలో విద్య, ఆరోగ్యానికి పెరుగుతున్న ప్రాధాన్యత గురించి వివరించారు. సామాజిక శ్రేయస్సును పెంపొందించడంలో పెట్టుబడిదారులు ముందుండాలన్నారు. విశాఖపట్నం ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మారథాన్‌లో అధిక సంఖ్యలో యువత, ఆయా సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు.